సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



గిరిజనుల సంక్షేమమే లక్ష్యం
గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఐటీడీఏ పని చేస్తోందని పీఓ రాహుల్ అన్నారు. గిరిజన దర్బార్‌లో ఆయన మాట్లాడారు. 10లో



.. పర్యావరణాన్ని రక్షిద్దాం
దీపావళి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చాలని పలువురు సూచిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

రైతులకు అండగా 'సాక్షి'

మార్కెటింగ్ శాఖ అధికారితో నేడు 'ఫోన్ ఇన్'

సాక్షి ఫోన్ ఇన్



నరేందర్

కొత్తగూడెంఅర్బన్: పంటల కొనుగోళ్ల సీజన్ మొదలైన నేపథ్యాన రైతులకు అవగాహన కల్పించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రస్తుతం పత్తి విక్రయాలు మొదలు కాగా కొనుగోలు కేంద్రాలు, పత్తిలో తేమ, ఇతర సందేహాలు ఉంటే రైతులు ఫోన్ ఇన్‌ను ఉపయోగించుకోవచ్చు. రైతుల సందేహాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి జె.నరేందర్ నివృత్తి చేస్తారు.

తేదీ : 29-10-2024, మంగళవారం
సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్లు :
73307 33374
99497 02944

న్యూస్‌రీల్

రామయ్య ప్రసాదం ఓకే !

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రసాదాల క్వాలిటీకి ఆమోదం లభించింది. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూల వివాదం నేపథ్యంలో.. రామాలయ ప్రసాదం క్వాలిటీ, సామగ్రిని తనిఖీ చేయాలని ఈఓ రమాదేవి ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాశారు. దీంతో వారు భద్రాచలం వచ్చి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు తరలించారు. పరిశీలన అనంతరం ప్రసాదాలు నాణ్యతగా ఉన్నాయని ధ్రువీకరించారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యాయ సమస్యలుంటే ఉచితంగా పరిష్కరిస్తాం



వృద్ధాశ్రమంలో పత్రాలు పరిశీలిస్తున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: అనాథాశ్రమాల్లో ఉండే వృద్ధులకు ఏమైనా న్యాయపరమైన సమస్యలుంటే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. సోమవారం ఆమె కొత్తగూడెం చమన్ బస్తీలోని జ్యోతి అనాథాశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. న్యాయ సంబంధ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీఎస్సీ – 2024లో 1:3 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)కు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 29, 30 తేదీలలో కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరుగుతుందని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు అభ్యర్థులందరికీ ఫోన్ ద్వారా సమాచారం అందించామని తెలిపారు. అభ్యర్థులు 1వ తరగతి నుంచి అత్యధిక విద్యార్హత వరకు ఉన్న స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, టీఈటీ అర్హత ధ్రువపత్రం, ఆర్‌సీఐ సర్టిఫికెట్, దివ్యాంగులైతే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని వివరించారు. రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, అన్ని విద్యార్హతల మెమోలు, ప్రొవిజినల్ సర్టిఫికెట్లు ఒరిజినల్‌తో పాటు రెండు జిరాక్స్ సెట్లపై గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించి తీసుకుని రావాలని సూచించారు. కాగా, ఇటీవలి ఎంపికల సమయంలో కోర్టు కేసుతో నిలిచిపోయిన ఎనిమిది పోస్టులకు సంబంధించి 20 మంది అభ్యర్థులు పరిశీలనకు రానున్నారని తెలిపారు.

రెచ్చిపోతున్న మద్యం సిండికేట్

- గ్రామాలు, గల్లీల్లో యథేచ్ఛగా బెల్ట్ షాపులు
- గిరిజనుల కష్టార్జితం సిండికేట్ ఖజానాలోకి
- అక్రమాలపై గొంతెత్తిన గిరిజన సంఘాలు
- ఇల్లెందు ఎక్సైజ్ స్టేషన్‌లో సేవాలాల్ సేన ఫిర్యాదు





ఏజెన్సీలో బెల్ట్ దందా!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నిబంధనల ప్రకారం వైన్స్, బార్ షాపుల్లోనే మద్యం విక్రయించాలి. కానీ వాటి కంటే బెల్ట్ షాపుల్లోనే ఎక్కువ అమ్మకాలు జరుగుతున్నాయి. వైన్స్‌ల్లో ఎమ్మార్పీకి మించి అమ్మకూడదు. అదే బెల్ట్‌షాపుల్లో అయితే ఆ ధరతో సంబంధం లేదు. దీంతో లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు వైన్స్‌లో కంటే బెల్ట్ షాపుల్లో అమ్మకాలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఇందుకోసం సిండికేట్‌గా ఏర్పాటవుతున్నారు. మద్యం ప్రియులు ఎక్కువగా ఇష్టపడే పాపులర్ బ్రాండ్లను పూర్తిగా బెల్ట్‌షాపులకే పరిమితం చేసి, ఎక్కువ ధరకు అమ్ముతూ తమ గల్లా పెట్టె నింపుకుంటున్నారు. దీంతో మద్యం కొనుగోలు వ్యవహారంలో వినియోగదారులు అడ్డంగా దోపిడీకి గురవుతున్నారు. ముఖ్యంగా గిరిజనులు ఎక్కువగా ఉండే ఇల్లెందు, అశ్వారావుపేట, పాల్వంచ, చర్ల, అశ్వారావుపేట వంటి చోట్ల ఈ తరహా దోపిడీ నానాటికీ పెచ్చుమీరుతోంది.

సేవాలాల్ సేన ఫిర్యాదు..

బెల్ట్‌షాపుల దందా, ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయాలపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదని తరచుగా ఎక్సైజ్ అధికారులు చెబుతుంటారు. అయితే ఈసారి వారికి ఆ అవకాశం ఇవ్వకుండా ఇల్లెందు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా సేవాలాల్‌సేన నాయకులు ఈనెల 24న ఫిర్యాదు చేశారు. పెసా, 1/70 వంటి చట్టాలు అమలయ్యే ఇల్లెందు ఏజెన్సీలో ఎక్కువగా నివసించే గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పల్లెల్లో ఇష్టారీతిగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తున్నారని, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గోడౌన్ల నుంచే నేరుగా బెల్ట్‌షాపులకు భారీ ఎత్తున మద్యం సరఫరా జరుగుతోందని, వీటిని సత్వరమే అమ్మేందుకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు కూడా బెల్ట్‌షాపులు తెరిచే ఉంటున్నాయని తెలిపారు. ఈ అక్రమాలను వెంటనే అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాల అమలేది..?

రాష్ట్రంలోనే అత్యధిక అడవులు భద్రాద్రి జిల్లాలో ఉన్నాయి. జిల్లా జనాభాలో 50శాతం వరకు గిరిజనులే ఉన్నారు. చిన్న, సన్నకారు రైతులుగా, కార్మికులుగా, కూలీలుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సామాజిక వెనుకబాటుతో పాటు అక్షరాస్యత కూడా తక్కువే. అందుకే మైదాన ప్రాంత వాసులు, గిరిజనేతరుల నుంచి ఇక్కడి ప్రజలను కాపాడేందుకు పెసా, 1/70 వంటి చట్టాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఇక్కడ కనీసం వడ్డీ వ్యాపారం చేయడం కూడా నేరమే. అలాంటి చోట పేద గిరిజనులు చెమటోడ్చి సంపాదించిన సొమ్మును మద్యం అమ్మకం పేరుతో తన ఖజానాలోకి మళ్లిస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉలుకూ పలుకూ లేదు..

మద్యం సిండికేట్‌తో ఇక్కడి గిరిజనులు మోసపోతున్న వైనంపై తాము ఫిర్యాదు చేసి నాలుగు రోజులైనా ఇల్లెందు ఎక్సైజ్ అధికారుల్లో ఉలుకూ పలుకూ లేదని సేవాలాల్ సేనా బాధ్యులు అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఉద్యమ బాట పడతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రామ్‌ప్రసాద్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. ఆఫీసుకు వెళితే ఆయన సెలవులో ఉన్నారని ఎస్‌ఐ అచ్చారావు తెలిపారు.

తాము చెప్పిందే ధర..

సేవాలాల్ సేన ఫిర్యాదుతో ఇల్లెందు ఏజెన్సీలో మద్యం అమ్మకాల్లో చోటుచేసుకున్న గడబిడలు మరోసారి వెలుగులోకి వస్తున్నాయి. గతేడాది లైసెన్స్‌లు దక్కించుకున్న వారు కనీసం ఒక్క ఏడాదైనా వ్యాపారం చేయకముందే రాజకీయ పలుకుబడి గల ఓ మద్యం వ్యాపారి ఇతరుల షాపులపై కన్నేశాడు. ప్రతీ లైసెన్స్‌డ్ మద్యం దుకాణానికి రేటు కట్టి అన్నీ తన పరిధిలోకి రావాల్సిందేనని మూడు నెలల క్రితం హుకుం జారీ చేశాడు. ఈ మేరకు అన్ని షాపులను అనధికారికంగా అతడే నిర్వహిస్తున్నాడు. ఇల్లెందులో తాను చెప్పిందే ధర అన్నట్టుగా అమ్మకాలు సాగేలా చేస్తున్నాడు. ఏజెన్సీలోని అమాయక గిరిజనులకు అధిక ధరలకు మద్యం అమ్మడం ద్వారా వచ్చిన సొమ్ముతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అంతేకాకుండా ఇటీవల ఏపీలో నిర్వహించిన మద్యం దుకాణాల టెండర్లలోనూ అనేక షాపులను 'లడ్డూ'లా దక్కించుకున్నాడు. ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో మరింత అధిక ధరలకు మద్యం అమ్మేలా సరికొత్త వ్యూహాల అమలుకు తెర లేపినట్టు సమాచారం.

పామాయిల్ హబ్‌గా తెలంగాణ

- టన్ను కనీస ధర రూ.20వేలు వచ్చేలా కేంద్రంతో చర్చిస్తాం
- మలేషియా పర్యటన వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట : తెలంగాణ రాష్ట్రాన్ని పామాయిల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మలేషియా పర్యటనకు వెళ్లొచ్చిన తుమ్మల.. సోమవారం మండలంలోని గండుగులపల్లిలో విలేకరులకు వివరించారు. ఆ దేశంలో పామాయిల్ సాగులో అవలంబించే సాంకేతిక విధానాలు, ప్రాసెసింగ్, రిఫైనరీ ప్లాంట్లను అధికారులతో కలిసి పరిశీలించామని, ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి జోహారి అబ్దుల్ ఘని, ఎక్స్‌టర్నల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రీజల్ మెరికాన్, పామాయిల్ బోర్డు డైరెక్టర్ అహ్మద్ పర్వీజ్‌హాజీ గులాంఖదీర్‌తో సమావేశమై తెలంగాణతో వాణిజ్య అవకాశాలు, వ్యాపార సంబంధాలు, పామాయిల్ సాగుకు తోడ్పాటు తదితర అంశాలపై చర్చించామని వివరించారు. రాష్ట్రంలోని 31 జిల్లాలు పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉన్నందున త్వరలోనే ప్రతీ ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఆయిల్‌ఫెడ్ కేంద్రాలను విస్తరింపజేస్తామని చెప్పారు. పామాయిల్ సాగులో ఎక్కువ దిగుబడి ఇచ్చేలా మలేషియా సహకారం, సాంకేతికతతో రాష్ట్రంలో పామాయిల్ సీడ్ గార్డెన్, ఆయిల్ రిఫైనరీల ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. పామాయిల్ సాగులో వినియోగించే యంత్రాలు, పరికరాలను మలేషియా నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. పామాయిల్ వ్యర్థాల నుంచి పలు ఉత్పత్తులను తయారు చేసేలా ఫ్యాక్టరీలు నెలకొల్పాలని మలేషియా ప్రతినిధులను ఆహ్వానించామని తెలిపారు. పామాయిల్, కొబ్బరి సాగులో అంతరపంటలుగా కోకో, వక్క, మిరియాలు, మునగ వంటివి సాగుచేస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. అంతర పంటలపై అధ్యయనానికి త్వరలో రైతులు, అధికారులను కర్ణాటకకు పంపిస్తామన్నారు. మలేషియాలో వర్షాలు ఎక్కువగా పడడంతో సాగుకు నీటి అవసరం తక్కువని తెలిపారు. మొక్క దశలోనే తెగుళ్ల నివారణకు అక్కడ అవలంబించే పద్ధతులను రాష్ట్రంలోనూ అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో సంవత్సరానికి లక్ష ఎకరాల పామాయిల్ సాగు లక్ష్యంగా ముందుకుపోతున్నామని, 70 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. పామాయిల్ టన్ను కనీస ధర రూ.20 వేలు వచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.

పర్యాటక అభివృద్ధిపై నజర్

- తాలిపేరు, తుమ్మలచెరువును పరిశీలించిన కలెక్టర్ పాటిల్
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



అశ్వాపురం : తుమ్మలచెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

చర్ల/అశ్వాపురం : పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. చర్ల మండలంలోని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టు, అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాలిపేరు ప్రాజెక్ట్ రెండు రాష్ట్రాలకు సరిహద్దులో ఉందని, ప్రాజెక్టులో ఎప్పుడూ నీటి నిల్వతో పాటు ఎగువన దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో టూరిజానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. స్థానిక పరిస్థితులపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. తాలిపేరు క్రస్ట్ గేట్ల వద్ద స్కాడా ద్వారా ఏర్పాటు చేసిన టెక్నాలజీని పరిశీలించారు. అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువును కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. చెరువు వరకు రహదారి నిర్మాణానికి, వీధిలైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. తుమ్మలచెరువు వద్ద బోటింగ్, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఏం చర్యలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకుముందు చర్ల మండలం జంగాలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధనను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో తాలిపేరు ప్రాజెక్టు ఈఈ రాంప్రసాద్, డీఈ తిరుపతి, మిషన్ భగీరథ డీఈ యేసుబాబు, చర్ల, అశ్వాపురం తహసీల్దార్లు శ్రీనివాస్, స్వర్ణలత, ఎంపీడీఓలు ఈదయ్య, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకోవాలి

మణుగూరు టౌన్: ఐటీఐ విద్యార్థులు ప్రభుత్వ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, శిక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం ఆయన ప్రభుత్వ ఐటీఐని సందర్శించి కోర్సుల వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఐటీఐల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏటీసీ భవన నిర్మాణ పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్, శిక్షణాధికారి రవి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏటీఓలు శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నర్సయ్య, వేణుగోపాల్, సూపరింటెండెంట్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

వినతులపై సత్వరమే స్పందించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్రజావాణిలో సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన వినతులపై సత్వరమే స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులను స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- గుండాల మండలం కాచనపల్లికి చెందిన దివ్యాంగురాలు కుంజా శైలజ.. తాను ఇంటర్ వరకు చదువుకున్నానని, జీవనోపాధికి మీ సేవ కేంద్రం ఏర్పాటుకు అనుమతించాలని దరఖాస్తు చేయగా ఈడీఎంకు ఎండార్స్ చేశారు.
- 1986 గోదావరి వరదల్లో తన ఇల్లు మునిగిపోయిందని, దీంతో ప్రభుత్వం 1987లో భూపాలపట్నంలో 15 సెంట్ల భూమి ఇచ్చిందని, అయితే దాన్ని తిరిగి అటవీ శాఖ కార్యాలయం కోసం తీసుకుని, పినపాక మండలం ఎల్‌సి రెడ్డి పల్లిలో మూడెకరాల భూమి ఇవ్వగా మళ్లీ అటవీశాఖ స్వాధీనం చేసుకుందని పినపాక మండలం ఏడూళ్ల బయ్యారానికి చెందిన జక్కుల వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేయగా తగు చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- కొత్తగూడెంలోని చిన్న బజారులో 6 – 3 –73 నంబర్ గల బిల్డింగ్ షాపు తమ తండ్రి ముగ్ధపురం రత్తయ్య పేరున పట్టా ఉందని, ఆయనకు ముగ్గురు సంతానం కాగా, ఇద్దరు తమ్ముళ్లు మరణించారని, ప్రస్తుతం తాను ఒక్కడినే వారసుడినని, అయితే ఆ భవనాన్ని ముగ్ధపురం శోభారాణి అక్రమంగా తన పేరు మీదకు మార్చుకుందని, ఏ పత్రాల ఆధారంగా క్రమబద్ధీకరించారో తెలియజేయాలని ముగ్ధపురం చంద్రసేన చేసిన దరఖాస్తును కొత్తగూడెం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

రక్తదానంతో అండగా నిలుద్దాం

ఎస్పీ రోహిత్‌రాజ్



రక్తదాన శిబిరంలో ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కొత్తగూడెంటౌన్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుద్దామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. పోలీస్ అమరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐఎంఏ హాల్‌లో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు అమరుల సేవలు ఎప్పటికీ గుర్తుండేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరంలో 130 యూనిట్ల రక్తం సేకరించామని తెలిపారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని, తద్వారా శరీరంలోకి కొత్త రక్తం చేరుతుందని, ఆరోగ్యం కూడా బాగుంటుందని చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం కావాల్సిన వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి, త్రీటౌన్, జూలూరుపాడు సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, ఆర్‌ఐలు సుధాకర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మరణించిన ఎస్సై కుటుంబానికి చెక్కు..

కొత్తగూడెం క్రైం బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాది నర్సంపేటలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎస్సై కుమారస్వామి కుటుంబానికి రోడ్డు భద్రత విభాగం నుంచి మంజూరైన రూ.10.05 లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఈఓ జయరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం

బూర్గంపాడు: గంజాయ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. వర్టికల్స్ వారీగా ఎవరి విధులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు నిత్యం పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో గస్తీ నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్సైలు రాజేష్, నాగభిక్షం పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఉద్యోగుల ప్రతిభ

పాల్వంచ : ఇటీవల జూరాల జల విద్యుత్ కేంద్రంలో జరిగిన జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్యారమ్స్ టోర్నీలో కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. టీం ఈవెంట్‌లో ప్రథమ స్థానం, ఓపెన్ సింగిల్స్ విభాగంలో జి.రాజేశ్వర్ రెడ్డి ప్రథమ, ఓపెన్ డబుల్స్‌లో సత్తయ్య, సైదారావు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం కేటీపీఎస్ సీఈ పి.వెంకటేశ్వరరావు క్రీడాకారులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు జారే, రాందాస్ నాయక్



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పక్కన జారే ఆదినారాయణ తదితరులు



క్రీడా పోటీల సందర్భంగా ఎడ్లబండ్లతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను స్థానిక ప్రకాశం స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. అంతకుముందు పాత బస్ డిపో నుంచి స్టేడియం వరకు ఎడ్లబండ్లతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి పోటీల్లో రాణించాలని, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, గ్రామీణ క్రీడ అయిన కబడ్డీపై క్రీడాకారులు మక్కువ చూపాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కబడ్డీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, చీకటి కార్తీక్, నాగ సీతారాములు, తూము చౌదరి, కోనేరు చిన్ని, గోపాల్‌రావు, జేవీఎస్ చౌదరి, ప్రభాకర్‌రెడ్డి, తోట దేవీ ప్రసన్న, ఏళ్ల వెంకటరెడ్డి, చింతపుడి రాజశేఖర్, ఏనుగుల అర్జున్ రావు, రజాక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కక్ష పూరిత రాజకీయాలు : రేగా



మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: ప్రజాపాలన సాగిస్తామన్న కాంగ్రెస్ ఆ విషయాన్ని విస్మరించి ప్రజలకు కక్షా రాజకీయాలను అందిస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. భద్రాచలంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని పక్కన పెట్టి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా ప్రజలు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకుల, కార్యకర్తల గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే అంతకంతకు ముందుకు వెళ్తామే తప్ప ప్రజాసమస్యలపై పోరాటాలు ఆపేది లేదని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మానె రామకృష్ణ, సోయం రాజారావు, నాయకులు శ్రీనివాసరాజు, ఆకోజు సునీల్ కుమార్, కణితి రాముడు, కోల రాజు, రేసు లక్ష్మి, రాంరెడ్డి, ఏడుకొండలు, కాపుల సూరిబాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి క్రీడాకారులకు శిక్షణ

పాల్వంచరూరల్: ఉట్నూరులో వచ్చే నెల 5వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే గిరిజన పాఠశాలల క్రీడాకారులకు మంగళవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని క్రీడా పాఠశాలలో బాలురకు, కాచనపల్లిలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, ఆర్చరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాకారులకు వచ్చేనెల 4వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని హెచ్ఎం ఎల్.రామారావు తెలిపారు.

ఎట్టకేలకు బోడు గ్రామానికి ఆర్టీసీ బస్సు


బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో అధికారులు, బోడు గ్రామస్తులు

టేకులపల్లి: ఎట్టకేలకు మండలంలోని బోడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభమైంది. దశాబ్దాలుగా బస్సు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పలుమార్లు ఆందోళనలు కూడా చేపట్టారు. కాగా సోమవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ మలగం దేవేందర్‌గౌడ్ టేకులపల్లి నుంచి బోడు మీదుగా రామకృష్ణాపురం వరకు బస్సు సర్వీసును ప్రారంభించారు. రోజూ టేకులపల్లి నుంచి ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5.25 గంటలకు బస్సు బయల్దేరుతుందని డీఎం తెలిపారు. కొప్పురాయి, బర్లగూడెం ప్రాంతాలకు బస్సు సర్వీసు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. కంట్రోలర్ పోరండ్ల రామనర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో చెట్ల లెక్కింపు


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎఫ్‌డీఓ మక్సూద్

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా సేకరించనున్న అటవీ భూమిలో చెట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం అటవీ అధికారులు ప్రారంభించారు. ఓసీ విస్తరణకు తిర్లాపురం, రామానుజవరం, మణుగూరులో ఉన్న 109.5 హెక్టార్ల అటవీ భూమితోపాటు అదనంగా మరో 1000 ఎకరాలు అవసరం ఉన్నట్లు సమాచారం. ఇందులో సింగరేణి ఆధీనంలో 187 ఎకరాలు ఉండగా, అటవీ భూమితో కలిపి మొత్తం 813 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించనున్నారు. కాగా తొలి దశలో 58.51 హెక్టార్లలో ఎఫ్‌డీఓ మక్సూద్ ఆధ్వర్యంలో చెట్ల లెక్కింపు చేపట్టారు. ఎనిమిది జట్లుగా ఏర్పడ్డ అటవీ సిబ్బంది చెట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత సీసీఎఫ్‌కు నివేదించనున్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్


పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఇల్లెందు: అన్నదమ్ముల్లా ఉన్న మాల మాదిగలను విడదీసేందుకు పాలకులు కుట్రలు పన్నారని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఏకం కావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం ఇల్లెందులో పాదయాత్ర సాగింది. కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ యత్నాలు మానుకోవాలని కోరారు. మంద కృష్ణమాదిగ కేంద్ర ప్రభుత్వానికి పావుగా మారాడని ఆరోపించారు. ఈ సమావేశంలో మాలమహానాడు ఇల్లెందు డివిజన్ అధ్యక్షుడు కాలే పుల్లయ్య, పండుగ ప్రసాద్, గడ్డి శ్రీనివాస్, పీజే సుందరం, సందా ప్రవీణ్, బాపన్న, అబ్బూరి సునీల్, గూడ బాబూరావు, సుజిత్, రాజు, భిక్షపతి, గోపాల్, పూర్ణ, బాబూరావు, బాబు, ఎస్.రాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచ: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పట్టణ పరిధిలోని సీతారాం పట్నం ఆడమ్స్ కళాశాల వెనుక పేకాట ఆడుతున్న సమాచారంతో ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఓ వ్యక్తి పరారయ్యాడు. నిందితుల నుంచి రూ.16 వేల నగదు, 4 సెల్‌ఫోన్‌లు, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

గ్రీన్ కాకర్స్‌ను కాల్చుదాం... పర్యావరణాన్ని రక్షిద్దాం

- దీపావళి టపాసులతో ఆరోగ్యానికీ ఇబ్బందులే
- బాణాసంచా తెచ్చే చేటుపై పర్యావరణ ప్రేమికుల ఆవేదన



కొత్తగూడెంటౌన్: దీపావళి పండుగ వచ్చిందంటేనే టపాసులు కాల్చుతూ అందరూ ఆనందంగా గడుపుతారు. అయితే పర్యావరణానికి హాని కలిగించని టపాసులైన గ్రీన్ క్రాకర్స్ కాల్చాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే వినియోగించాలని సుప్రీంకోర్టు కూడా తీర్పు ఇచ్చిందని గుర్తుచేస్తున్నారు. దీపావళికి కాల్చే టపాసుల వల్ల పర్యావరణానికి చాలా విధాలుగా హాని కలుగుతోంది. టపాసుల తయారీలో నైట్రేట్, బొగ్గు, సల్ఫర్ వంటి హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తారు. దీంతో శబ్దకాలుష్యం, గాలి కాలుష్యం ఏర్పడుతుంది. మానవుల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. బాణాసంచా తయారీలో ఉపయోగించే రసాయన పదార్థాలు హానికరమని వైద్య నిపుణులు కూడా పేర్కొంటున్నారు. గ్రీన్ క్రాకర్స్‌తో దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవచ్చని చెబుతున్నారు. వీటిలో లిథియమ్, మెర్క్యురీ, అర్సెనిక్, లెడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగించరు. కానీ రసాయనాల టపాసుల లాగే రంగులు, మెరుపులు వెదజల్లుతాయి. వీటి వల్ల గాలి, శబ్ద కాలుష్యం తక్కువగా ఉంటుంది.

ఆరోగ్యానికి హానికరం

సాధారణటపాసుల తయారీలో బేరియం, పొటాషియం, నైట్రేట్, అల్యూమినియం, సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్‌మోనాక్సైడ్, మెగ్నీషియం, సోడియంలతో పాటు అనేక విషపూరిత రసాయనాలను ఉపయోగిస్తారు. వీటిని కాల్చినప్పుడు రసాయనాలు అన్ని గాలిలో కలుస్తాయి. మనం గాలిని పీల్చినప్పుడు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఊపిరితిత్తులు దెబ్బతినడం, తలనొప్పి, అధిక శబ్దంతో వినికిడి శక్తి లోపించడం వంటి సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

గ్రీన్ క్రాకర్స్ మాత్రమే వినియోగించాలి



దీపావళికి కాలుష్యం నివారించేలా గ్రీన్ క్రాకర్స్‌నే వినియోగించాలి. పర్యావరణానికి హాని కలిగించే టపాసులతో ఆరోగ్యం కూడా దెబ్బ తింటుంది. దీంతోపాటు ప్రతి ఒక్కరూ దీపావళి సందర్భంగా ఒక మొక్క నాటాలి. జిల్లా ప్రజలందరూ కాలుష్య రహిత బాణాసంచాను కాల్చి ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవాలి.

–కొట్టూరి నూర్వి రాజశేఖర్, మొక్కల ప్రేమికుడు, రామవరం

వ్యాధులు వచ్చే అవకాశం



టపాసులు కాల్చినప్పుడు గాలిలో ధూళి, దుమ్ము 60 పీపీఎంలు మించకూడదు. అదే దీపావళి టపాసుల్లో 300 నుంచి 400 పీపీఎం వరకు కాలుష్యం ఉంటుంది. వెలువడే విషవాయువులను పీల్చితే ఊపిరితిత్తులతోపాటు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. చర్మ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. గ్రీన్ క్రాకర్సే మంచివి.

– డాక్టర్ జి.వరుణ్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ కొత్తగూడెం

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేయాలి

- ప్రభుత్వ అనుమతి లేకుండా బాణాసంచా దుకాణాలు నడపొద్దు
- అదనపు కలెక్టర్ వేణుగోపాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): టపాసుల వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరూ బాణాసంచా దుకాణాలు నడపొద్దని హెచ్చరించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం దీపావళి టపాసుల షాపుల ఏర్పాట్లు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న దీపావళి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దుకాణాల నిర్వాహకులు అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ, మున్సిపల్, గ్రామపంచాయతీల అనుమతులు తప్పనిసరి తీసుకోవాలన్నారు. షాపులు పేలుడు రహితంగా ఉండాలని అన్నారు. రెండు దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలని, ఎదురెదురుగా ఉండరాదని చెప్పారు. నిషేధిత టపాసులు అమ్మకుండా నిఘా పెట్టాలని, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు. దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో వాహన పార్కింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, వాటర్ ట్యాంకులు, ఫైరింజన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ షాపులకు తాత్కాలిక మీటర్లు అందచేయాలన్నారు. వైద్యశాఖ హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, డ్రెస్సింగ్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. దీపావళి రోజు స్పెషలిస్టు డాక్టర్లు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో 24 గంటలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అక్రమాలపై ఉదాసీనంగా ఉండొద్దు


సింగరేణి ప్రధాన కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): అవినీతి అక్రమాలపై ఉదాసీన వైఖరి చూపొద్దని, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి ఆదిలోనే అరికట్టాలని సింగరేణి విజిలెన్స్ జీఎం ప్రసాద్‌రావు సూచించారు. సోమవారం కొత్తగూడెం ఏరియాతోపాటు ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'సమగ్రత, సంస్కృతి, దేశ పురోభివృద్ధి' నినాదాలతో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీఎం వెంకటరమణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వీ రమణమూర్తి, సీఎంవోఏఐ కార్యదర్శి ఎం.వి జయ్‌భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాలలో..

సింగరేణి మహిళా కళాశాల ప్రారంభించి వచ్చే ఏడాది సెప్టెంబర్ 13కు 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సోమవారం స్వర్ణోత్సవాలను ప్రారంభించి మొక్కలు నాటారు. ఆ తర్వాత విజిలెన్స్ వారోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీ – సంస్కృతి ద్వారా దేశ పురోగతి అనే అంశం ఇతివృత్తంగా విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం సుబ్బారావు, ఏజీఎం పి.రాజీవ్‌కుమార్, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు చింతా శారద, టి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఆరు నెలలకే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- బంధువైన వృద్ధురాలికి తీవ్రగాయాలు
- బైక్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం


బానోత్ గణేష్ (ఫైల్)

ఇల్లెందురూరల్/టేకులపల్లి: వివాహమైన ఆరు నెలలకే ఆ యువకుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఆరు బయట కల్యాణ తీపి గుర్తులు.. వారసుడొస్తున్నాడని తెలిసి నవదంపతుల సంబరం అంతలోనే ఆవిరైంది. అతని బంధువైన వృద్ధురాలికి కూడా తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందు మండలంలోని పోలారం పంచాయతీ భద్రుతండాకు చెందిన బానోత్ గణేష్ (24) ఆరు నెలల క్రితం టేకులపల్లి మండలం కొండంగుల బోడు గ్రామానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమె ప్రస్తుతం గర్భిణి. దీంతో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన, ఆమె అమ్మమ్మ మేది పోలారం గ్రామానికి చేరుకుని మనుమరాలిని పలకరించి ఆనందాన్ని పంచుకుంది. దీపావళి పండుగను కుమార్తె ఇంట్లో జరుపుకోవాలనే ఆకాంక్షతో కొండంగుల బోడు గ్రామానికి బయలుదేరింది. దీంతో మనువడు గణేష్ వృద్ధురాలిని దిగబెట్టేందుకు బైక్‌పై తీసుకుని వెళ్లాడు. ఈ క్రమంలో మద్రిగూడెం గ్రామ పంచాయతీ రామకృష్ణాపురం గ్రామం దాటగానే, ఇల్లెందు –టేకులపల్లి మండలాల సరిహద్దు ప్రాంతంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో గణేష్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. వృద్ధురాలికి తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లింది. ఆమెను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా మృతుడి భార్య, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. ఆనందంగా ఉన్న కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదం నింపిందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ తంత్రి మార్కండేయపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా పశువులను కబేళాకు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేట రింగ్‌రోడ్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఏపీలోని కాకినాడ జిల్లా తుని నుంచి వ్యానులో 12 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిందితులు, తుని మండలానికి చెందిన గొర్ల విజయస్వామి, తుర్రందాసు వీరశివ, గొంప రోహిత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దుమ్ముగూడెంలో ఇద్దరిపై..

దుమ్ముగూడెం : పశువులను అక్రమంగా తరలిస్తున్న అశ్వాపురం మండలానికి చెందిన మారాసు సాయి, అబ్దుల్ కలీమ్‌లపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. దుమ్ముగూడెం మండలంలో, చర్ల సంతలో, ఛత్తీస్‌గఢ్ సంతలో పశువులను కొనుగోలు చేసి గంగోలు వద్ద గోదావరి నది దాటించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

అడిషనల్ పీడీ రవి


మాట్లాడుతున్న అడిషనల్ పీడీ రవి

జూలూరుపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ–ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో రూ.3.40 కోట్లతో 305 రకాల పనులు నిర్వహించగా, పలువురు అక్రమాలకు పాల్పడ్డారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. ఉపాధి సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపా రు. అనంతరం అడిషనల్ పీడీ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడ్డ ఉపాధి సిబ్బంది నుంచి రూ. 22,200 రికవరీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ, డీవీఓ రమణ, అంబుడ్స్‌మన్ ప్రకాష్, డీఆర్‌డీఏ ఆఫీస్ అనూష, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, సోషల్ ఆడిట్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి బాంబులు పేలి..

తల్లీకొడుకులకు తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: దీపావళి పండుగ నేపథ్యంలో ఓ వ్యాపారి అక్రమంగా బాణాసంచా తయారీ చేస్తుండగా, అవి కాస్తా పేలిపోవడంతో తల్లి, కొడుకులకు తీవ్రగాయాలైన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని నారంవారిగూడెం కాలనీకి చెందిన టి.ప్రదీప్ అనే కిరాణా వ్యాపారి అనుమతులు లేకుండా వివిధ రకాల బాణాసంచాను స్వయంగా తయారీ చేస్తున్నాడు. ఈ క్రమంలో నార బాంబులు ప్లేటులో నుంచి జారీ కిందపడి ఒక్కసారిగా పేలిపోయాయి. ఈ పేలుడు ధాటికి షెడ్డుపై ఉన్న రేకులు, అరుగు భాగం ధ్వంసమైంది. ప్రదీప్ పాదం భాగం నుజ్జునుజ్జు కాగా, పక్కనే ఉన్న తల్లికి కూడా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిన దీపావళి బాంబులతో చుట్టు పక్కల వారంతా భయందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై యయాతి రాజు తెలిపారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందిస్తూ వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ మార్గదర్శనంలో ఐటీడీఏ పని చేస్తోందని పీఓ బి.రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, ఈఎంఆర్‌ఎస్‌ల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీరు, ఇతర వసతులను కల్పించేలా హెచ్‌ఎంలు, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. దర్బార్‌కు వచ్చే గిరిజనులకు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికాలని, అర్హతల మేరకు వారి సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి చొరవ చూపాలని సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని పీఓ వెల్లడించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతో పాటు వివిధ విభాగాల అధికారులు తానాజీ, భాస్కరన్, ఉదయ్‌కుమార్, ఆర్.లక్ష్మీనారాయణ, మునీర్‌పాషా, లింగానాయక్, మణిధర్, హరికృష్ణ, శ్రీనివాసరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

దమ్మపేట: భార్య మందలించడంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దమ్మపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామానికి పందేటి సత్యనారాయణ(32) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా కుటుంబ పోషణను పట్టించుకోవడంలేదు. భర్త ప్రవర్తనతో విసుగు చెందిన భార్య వాణి భర్త సత్యనారాయణను మందలించింది. దీంతో మద్యం మత్తులో క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

నారాయణపురంలో...

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలో జరిగింది. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన తగరం ప్రవీణ్‌కుమార్(20) కొంత కాలంగా చెడు వ్యసనాలకు బానిసై మానసిక ఒత్తిడికి గురవుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రమణయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ..

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని శివనగర్‌కు చెందిన నంబూరి వెంకట నారాయణ ఆటో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో తీవ్రనష్టం రావడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో కుటుంబీకులు మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో వెంకట నారాయణ భార్య నాగమల్లేశ్వరి(40) ఆదివారం రాత్రి ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి తండ్రి సన్నిదానపు రామకృష్ణ సోమవారం ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రక్షణ చర్యలు పాటించాలి


దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మణుగూరుటౌన్: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలు ఖచ్చితంగా రక్షణ చర్యలు పాటించాలని ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. సోమవారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట వద్ద ఏర్పాటు చేసిన దీపావళి స్టాల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల నిర్వాహకులతో మాట్లాడుతూ.. లెసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాల పరిశీలన

అశ్వాపురం: మండలంలో ప్రభుత్వ అనుమతులతో దీపావళి బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సోమవారం పరిశీలించారు. అశ్వాపురం, మొండికుంట గ్రామాల్లో బాణాసంచా దుకాణాలను సందర్శించి మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా దుకాణాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్ఐ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి

టేకులపల్లి: ప్రభుత్వాస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ బాలాజీ సూచించారు. సోమవారం మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గర్భిణీల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. కాగా ఆస్పత్రిలో సిబ్బంది కొరతను తీర్చాలని వైద్యాధికారి డాక్టర్ దినేష్ కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ శ్రీ, సిబ్బంది వజ్జా పార్వతి, చంద్రకళ, దేవా, విజయ, కౌసల్య సింగ్, ధర్మపురి రవికుమార్, నాగలక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఇల్లెందురూరల్: అక్రమంగా తరలిస్తున్న రెండు కేజీల ఎండు గంజాయిని సోమవారం మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కె.వెంకటేష్, కిషోర్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడ్డారు. రెండు కేజీల గంజాయి, సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీలో సిబ్బంది కరీం, బాలు, సుధీర్, హరీష్, వెంకట్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

భద్రాచలంటౌన్: ఏపీలోని గుండువారిగూడెం నుంచి అక్రమంగా సారపాకకు తరలిస్తున్న నాటుసారాను ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ వద్ద సోమవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. ముగ్గురు వ్యక్తులను అనుమానాస్పదంగా కనిపించగా పట్టుకుని విచారించారు. వారి నుంచి 38 లీటర్ల నాటుసారాను, ఆటో, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, నిందితులపై కేసు నమోదు చేశామని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.